విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

స్వచ్ఛమైన ఓటర్ల జాబితా అందరి లక్ష్యం

- యువ ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టండి
- జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర - ఏలూరు : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా డిశంబరు 9వ తేదీలోగా తమ ఓటు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో శనివారం గుర్తింపు పొందిన రాజకీయ పక్షాల ప్రతినిధులతో ఓటరు జాబితా సవరణ కార్యక్రమం, ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందించడం అందరి లక్ష్యమని ఇందుకు అందరూ సహకరించాలన్నారు. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అయినప్పటికీ జనవరి 5వ తేదీన ప్రకటించే తుది ఓటరు జాబితాలో ఓటరుగా ఉండాలంటే తప్పనిసరిగా డిశంబరు 9వ తేదీలోపు అర్హత కలిగిన వారందరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. ఈనెల 2,3 తేదీలు శనివారం, ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఓటరు నమోదుకు సంబంధించి ఎక్కడైనా సమస్య వుంటే వెంటనే ఫారం-6,7,8 ద్వారా ధరఖాస్తు చేసుకుంటే ఓటరుగా నమోదు అయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, వివిధ రాజకీయ నాయకుల ప్రతినిధులు దేవరపల్లి రత్నబాబు(బిఎస్పీ), నెరుసు నెలరాజు(బిజెపి), ఎ. రవి(సిపిఎం), రాజనాల రామ్మోహన్ రావు (కాంగ్రెస్), ఎస్ కె మస్తాన్ భాష (ఆమ్ ఆద్మీ), పాలి ప్రసాద్(టిడిపి), కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులపట్ల ఉక్కుపాదం

విశాలాంధ్ర-ముదినేపల్లి : అసాంఘిక శక్తుల పట్ల ఉక్కుపాదం మోపుతున్నామని, 6 జిల్లాల్లో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని ఏలూరు రేంజ్ డిఐజి అశోక్ కుమార్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌ను డిఐజి అశోక్ కుమార్, ఎస్పీ డి.మేరీ ప్రశాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు, వాడకంపై 2022లో 21వేల కేసులు, 23లో 902 కిలోల గంజాయి సీజ్ చేసి 250 కేసులు నమోదు చేసి 3201 మందిని అరెస్టు చేశామన్నారు. గంజాయి వాడకం, అక్రమ రవాణాపై ఎస్పీల పర్యవేక్షణలో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. దీనిపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు సిబ్బంది నిర్వహిస్తున్నారన్నారు. ప్రస్తుతం గంజాయి కేసులు అదుపులో ఉన్నాయన్నారు. ఇటీవల మహిళపై యాసిడ్ దాడి కేసులో ముగ్గురికి యావజ్జీవ శిక్షలు పడ్డాయన్నారు. ముఖ్యమైన 3వేల కేసులు 6జిల్లాల్లో ఎస్పీ స్థాయి అధికారుల నుండి ఎస్సై స్థాయి వరకు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో రానున్న ఎన్నికల నాటికి ముందస్తుగానే సమస్య, అతిసమస్యాత్మక గ్రామాలను గుర్తించడానికి ఎస్పీ, డిఎస్పి, సీఐ ఆధ్వర్యంలో ప్రణాళిక ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కైకలూరు రూరల్ సీఐ బి. కృష్ణ కుమార్, ముదినేపల్లి ఎస్ఐ డి. వెంకట్ కుమార్, కలిదిండి ఎస్ఐ ప్రియ కుమార్, కైకలూరు రూరల్ ఎస్ఐ జ్యోతిబసు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ పోరాట సదస్సు జయప్రదం చేయండి

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-ఏలూరు: ఈనెల 4వతేదీన కామవరపుకోటలో జరగనున్న భూ పోరాట సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. దున్నే వాడిదే భూమి అనే నినాదంతో సాగులో ఉన్న కౌలుదారులకు, పేదలకు జమీందారీ, ప్రభుత్వ భూములు దఖలు పరచాలని సిపిఐ తొలి నుండి పోరాటం చేస్తుందన్నారు. కామవరపు కోటలో అటవీ బంజరు, జీడి మామిడి తోటలు పేదలకు పంచాలని ఉద్యమాలు చేసిన చరిత్ర సిపిఐ కి ఉందన్నారు. కామవరపుకోటలో ఇంకా భూ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. భూ సమస్య పరిష్కారం కోసం కామవరపుకోటలో ఈనెల 4న భూ పోరాట సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సులో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ కోటేశ్వరరావు, ఏలూరు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, కార్యదర్శి కుంచే వసంతరావు, తదితరులు పాల్గొంటారని తెలిపారు.

మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యమే గ్రామ సచివాలయ వ్యవస్థ

విశాలాంధ్ర - గణపవరం: ఆనాడు మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యమే ఈనాడు గ్రామ సచివాలయం వ్యవస్థ ఏర్పాటు అని, దీనికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి కృషి నవ రత్నాలలో భాగమని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీని వాసరావు (వాసుబాబు) అన్నారు. మంగళవారం గణపవరం మండలం అగ్రహార గోపవరం గ్రామంలో రూ. 43 లక్షలు అంచనా వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటైన తర్వాత గ్రామ ప్రజలకు సర్వీసులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. కార్యాలయాల చుట్టూ తిరగనవసరం లేకుండా గ్రామంలోనే వారి సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఈ అవకాశాన్ని గ్రామంలో ఉన్న ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాతం శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవవరపు సోమలక్ష్మి, ఎంపీపీ దండు వెంకటరామరాజు(అర్థవరం రాము),మండల పార్టీ కన్వీనర్ దండు రాము, వైయస్సార్ పార్టీ టిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కాకర శ్యామ్ సుందర్ (సన్), దేవరపు బాబుల్, పాతంశెట్టి శ్రీనివాసరావు, వడ్డీ ఉమా మహేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - గణపవరం: వరి పండించే రైతులు భారీ వర్షాలు కారణంగా అప్రమత్తంగా ఉండాలని తాడేపల్లిగూడెం వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు పి. మురళీకృష్ణ అన్నారు. శనివారం గణపవరం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపవరం మండలంలో సార్వావరి పంటను 11,694 ఎకరాల్లో సాగు చేశారని, ఇప్పటివరకు సుమారు 5,500 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయని అన్నారు. 6 వేల ఎకరాల్లో వరి కోతలు కోయవలసి ఉందని పేర్కొన్నారు. రాగల మూడు రోజుల్లో భారీ వర్షాలు హెచ్చరికను వాతావరణ శాఖ జారీ చేసిందని ఆయన అన్నారు. ఒక మోస్తారు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, రైతులు దృష్టిలో పెట్టుకొని, అప్రమత్తంగా ఉండి వరి కోతలను మూడు రోజులు ఆగి వర్షాల ప్రభావం తగ్గిన తర్వాత కోతలు కోసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

9,10 తేదీల్లో ఏఐటీయూసీ మహాసభ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ఏలూరు: ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయుసి) ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ ఈనెల 9,10 తేదీలలో ఏలూరులో జరుగుతుందని మహాసభకు ఏఐటీయూసీ అనుబంధ ఉద్యోగ కార్మిక సంఘాల ప్రతినిధులు సుమారు 500 మంది హాజరవుతున్నారని ఏఐటియుసి ఏలూరు జిల్లా నాయకులు కె. కృష్ణమాచార్యులు, బండి వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కృష్ణమాచార్యులు,బండి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ప్రైవేటీకరణ విధానాలపై కార్మిక చట్టాల మార్పు అంశంపై మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనున్నట్టు తెలిపారు. ఏలూరు జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం నూజివీడు, చింతలపూడి పట్టణాలతో పాటు కైకలూరు, కామవరపుకోట, వేలేరుపాడు, కుక్కునూరు, పోలవరం, మండలాలలో సంఘటిత, అసంఘటిత, ఉద్యోగ,కార్మికుల సమస్యలను చర్చించి పోరాట కార్యక్రమాన్ని మహాసభలో నిర్ణయిస్తామని వారు పేర్కొన్నారు. కొత్తగా ఏర్పడిన ఏలూరు జిల్లా లో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ జయప్రదం కావడం కోసం సమన్వయ కమిటీ సభ్యులు పలు సూచనలు, ప్రతిపాదనలు చేశారని వారు తెలిపారు. సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఏఐటి యుసి మహాసభ జయప్రదం చేయడానికి జిల్లాలో ఉన్న ఏఐటియుసి, ఉద్యోగ,కార్మిక సంఘాల ప్రతినిధులు ఉదయం గం.9:30కే ఏలూరు ఆర్ఆర్ పేట వెంకటేశ్వర స్వామి గుడి వద్దకు చేరుకోవాలని కోరారు. వెంకటేశ్వర స్వామి గుడి వద్ద నుండి కార్మిక ప్రదర్శన, ఉదయం గం.10:30లకు సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ప్రతి నిధుల సభ జరుగుతుందని మహాసభ జయప్రదానికి సిపిఐ తమ సహాయ సహకారాలు అందిస్తుందని కృష్ణ చైతన్య తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటియుసి ఏలూరు జిల్లా నాయకులు రెడ్డి శ్రీనివాస డాంగే, డి. లక్ష్మణ్ మూర్తి, పుప్పాల కన్నబాబు, సిహెచ్ పుల్లారావు, తొర్లపాటి బాబు, కంకిపాటి బుచ్చిబాబు, ఎ. అప్పలరాజు, కుంచె వసంతరావు, కే విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర-ఏలూరు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షులు చాట్ల పుల్లారావు, ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం అడిషనల్ డైరెక్టర్ ఎండి షరీఫ్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పుల్లారావు, బుచ్చిబాబు మీడియాతో మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో చింతలపూడి, నూజివీడు మండలాలలో మధ్యాహ్న భోజన కార్మికులు వంట వండుతూ గంజి వార్చుతూ కాలిపోయి గాయపడిన వారికి, వంట వండిన తర్వాత స్కూల్ బయట రోడ్డు దాటుతూ ప్రమాదానికి గురై ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకున్న వారికి ప్రభుత్వం నుండి, ఎటువంటి సహాయం అందలేదన్నారు. కనీస భీమా సౌకర్యం, ఈఎస్ఐ సౌకర్యం లేదన్నారు. సొంత ఖర్చులతోనే ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో, అందరికీ బీమా, ఈఎస్ఐ సౌకర్యం వెంటనే కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాగి జావ కు కనీసం ఒక్కొక్క విద్యార్థికి మూడు రూపాయలు చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఒక్కొక్క విద్యార్థికి రూ.15 నుండి 20 చెల్లించాలన్నారు. కనీస వేతన చట్టం కింద పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.18వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీరికి గుర్తింపు కార్డులు, యూనిఫామ్స్ ఇవ్వాలన్నారు. వంటగ్యాసును రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ మీద ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయ కులు ఎం. స్వప్న, పి. రాజ్యలక్ష్మి, బి. భాగ్యం తదితరులు పాల్గొన్నారు.

పేరుపాలెం బీచ్‌కు పర్యాటకుల నిషేధం

విశాలాంధ్ర - మొగల్తూరు : తుపానుకారణంగా రాబోయే 5 రోజులు పేరుపాలెం, కె.పి.పాలెంలో ఉన్న బీచ్ ప్రాంతాల్లో ప్రజలు,అప్రమత్తంగా ఉండాలని మొగల్తూరు తహసీల్దార్ జి అనిత కుమారి తెలిపారు. పర్యాటకులు, ఇతర గ్రామాల నుండి ప్రజల రాకపోకలను పూర్తిగా నిషేధించామని, డిసెంబర్ 3వ తేదీ నుండి 8వ తేదీ వరకు తుఫాను హెచ్చరికలు పరిగణలోకి తీసుకుని అధికారులకు సహకరించాలని కోరారు.

వరికోతల వాయిదా మంచిది

విశాలాంధ్ర-టీ నరసాపురం: తుపాను ప్రభావంతో వాతావరణంలో మార్పుల కారణంగా రైతులు వరి కోతలను వాయిదా వేయడం మంచిదని మండల వ్యవసాయ శాఖ అధికారి డి. ముత్యాలరావు తెలిపారు. మండలంలోని ఏపిగుంట, తిరుమలదేవిపేట గ్రామాల్లో వరి పంటలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో 2600 ఎకరాలలో రైతులు వరి పంట సాగు చేస్తున్నారన్నారు. ప్రస్తతం కోతలు మొదలయ్యాయని తెలిపారు. వాతావరణంలో మార్పులు కారణంగా వరికోతలు వాయిదా వెయ్యాలన్నారు. ఏదైనా కారణంతో వరి పనలు తడిస్తే, మొలక రాకుండా 5శాతం ఉప్పు నీటిలో కలిపి పిచికారి చెయ్యాలన్నారు.

ఎట్టకేలకు భూ వివాదం పరిష్కారం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కొయ్యలగూడెం మండలం సరిపల్లి గ్రామ రెవిన్యూ పరిధిలో వంగ బొత్తప్ప గూడెం గ్రామంలో రైతులకు, గిరిజనులకు వ్యవసాయ భూములపై వివాదాలు చోటుచేసు కుంటున్నాయి. రైతులు సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములకు వంగబొత్తప్పగూడెం గ్రామానికి చెందిన గిరిజనులు అడ్డుపడడంతో వ్యవసాయ భూములలో రైతులు వ్యవసాయం చేయకుండా ఖాళీగా వదిలేశారు. ఇరువురు కోర్టును ఆశ్రయించడంతో రైతులకు అనుకూలంగానే కోర్టు ద్వారా తీర్పు రావడంతో పోలవరం సిఐ విజయ్ బాబు, ఎస్ ఐ జి జె విష్ణువర్ధన్, వారి సిబ్బంది కలసి గిరిజనులకు నచ్చచెప్పి రైతులు సాగు చేసుకుంటున్న భూములకు అడ్డుపడవద్దని పేర్కొనడంతో గిరిజనులు వెనుతిరిగి వెళ్లిపోయారు. రైతులు వారి పొలాలలో వ్యవసాయ పనులను ప్రారంభించారు.

ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరం

విశాలాంధ్ర - లింగపాలెం : ఓటర్ల నమోదుపై ప్రత్యేకశిబిరం లింగపాలెం మండలంలో చేపట్టారు. శని, ఆదివారా లలో జరుగుతుందని తహ శీల్దార్ ఆర్.వి.మురళీకృష్ణ తెలిపారు. రెండు రోజులపాటు జరిగే ఈ శిబిరంలో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులతోపాటు పోలీసులు పాల్గొంటారని తహశీల్దార్ పేర్కొన్నారు. ఓటర్ల మార్పులు, చేర్పులు అర్హులకు ఓటు హక్కు కల్పించటం అనర్హుల ఓట్లను తొలగింపు జరుగుతుందని తెలిపారు. చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తామని వెల్లడించారు.

ఫిజియోథెరపీ పై అవగాహన

విశాలాంధ్ర - కలిదిండి: ఉపాధ్యాయులు ఫిజియోథెరపీ పట్ల అవగాహన కలిగి ఉండాలని నిమ్స్ హాస్పిటల్ ఫిజియోథెరపీ వైద్యులు రమేష్ తెలిపారు. శనివారం స్థానిక ఎం ఆర్ సి కార్యాలయం నందు ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నరాల బలహీనత, గ్యాస్ , బ్యాక్ పెయిన్, ఆస్తమా, చర వాణిలో అతిగా వాడడం వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో. ఎంఈఓ పి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, PATCHAMATLA DEVI, W/o. Venkata suryanarayana, Resident of D. No. 7-2-32/2,Narasayya Agraharam, Bhimavaram, west godavari, A. P-534201. I have changed my name from PATSAMATLA DEVI (Old name) To **PATCHAMATLA DEVI** (new name) Hence after all my documents and correspondence will be continue with my new name **PATCHAMATLA DEVI.**

తుపాను ముందస్తు చర్యలు చేపట్టాలి

సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: తుపాను కారణంగా జిల్లాలో సార్వా రైతాంగం పంట నష్టపోకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని, రైతాంగానికి అవసరమైన సహాయ సహకారాలందించాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. శనివారం కొత్త పూసలమూరు గ్రామంలో సీపీఐ గ్రామ శాఖ సమావేశం తిరుమాని కామేశ్వరరావు నివాసంలో జరిగింది. ఈ సమావేశంలో భీమారావు మాట్లాడుతూ జిల్లాలో వరికోతలు ముమ్మరంగా జరుగుతున్న పరిస్థితుల్లో రెండు రోజులు జిల్లాలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చేసిన ప్రకటనతో జిల్లా రైతాంగం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఇప్పటికే జిల్లాలో 65 శాతం వరికోతలు పూర్తి కాగా ఇంకా 35 శాతం వరి కోతలు జరుగవలసి వుందన్నారు. రైతుల వద్ద నుంచి ధాన్యం త్వరితంగా కొనుగోలు చేయాలని తేమ అధికంగా వుందనే సాకుతో మిల్లర్లు తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు చేసే పరిస్థితులు నివారించి రైతులను ఆదుకోవాలని కోరారు.

4 న భీమవరంలో జిల్లా రైతు సంఘం సమావేశం

జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారానికి అవసరమైన కార్యాచరణ రూపొందించుటకు ఈ నెల 4న భీమవరంలో రైతు సంఘం జిల్లా సమావేశం నిర్వహించనున్నట్లు కోనాల భీమారావు చెప్పారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ ఈసమావేశానికి హాజరవుతున్నారన్నారు. జిల్లా రైతాంగం ఈసమావేశంలో పాల్గొని సమావేశం విజయవంతం చేయాలని భీమారావు కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాం ప్రసాద్, పార్టీ నాయకులు తిరుమాని కామేశ్వరరావు, వాటాల రాధాకృష్ణ,బస్వాని కృష్ణ, నాగిడి తులసిరావు, నాగిడి నాగరాజు, పి.రాంబాబు, నాయుడు పాండురంగారావు, తిరుమాని చంటిరాజు రైతులు మహిళలు పాల్గొన్నారు.

వృద్ధ కళాకారులకు కనీస పెన్షన్ రూ.7 వేలు ఇవ్వాలి

విశాలాంధ్ర-టీ నరసాపురం: వృద్ధ కళాకారులకు కనీస పెన్షన్ 7 వేలు పెంచాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రజా నాట్య మండలి జిల్లా కన్వీనర్ టివిఎస్ రాజు, సీనియర్ బుర్ర కథ కళాకారులు వీరమళ్ళ సత్యనారాయణలు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మో హన్ రెడ్డి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తు న్నప్పటికీ వృద్ధ కళాకారులను పట్టించుకోక పోవడం బాధాకరం అన్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్ళే వృద్ధ కళాకారులు వృద్ధాప్యంలో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వెంటనే స్పందించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలి

విశాలాంధ్ర - పెంటపాడు: పెరుగుతున్న జీవన వ్యయానికి తగువిధంగా 50 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని సిపిఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఆకుతీగపాడు సచివాలయం వద్ద సామాజిక పెన్షన్ దారుల సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో పెన్షన్లు పెంచాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ వితంతువులు, చేనేత,గీత, ఒంటరి మహిళల పెన్షన్ ను నెలకు రూ. 6వేలు, విభిన్న ప్రతిభావంతులకు నెలకు రూ. 7వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. వృద్ధుల సంరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి రక్షణ కల్పించాలని కోరారు. సామాజిక పెన్షన్ల భద్రతకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ సచివాలయం కార్యదర్శి డి. నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వంక అప్పారావు, పెన్షన్ దారులు జానా సూర్యారావు, కంపాటి పాపమ్మ, దాసం సావిత్రి, నూలు సుబ్బాయమ్మ, తమ్మిశెట్టి సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

4న రైతు సంఘ సమావేశం జయప్రదం చేయండి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: అకాల వర్షాలు, తుపాన్లు, వరదల కారణంగా రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వాలు రైతులు పట్ల చిన్నచూపు చూస్తున్నాయని అన్నం పెట్టేరైతులకు ప్రభుత్వం చుక్కలు చూపిస్తున్నదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. సీతారాం ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయం కాపర్తిభవన్లో రైతుల ముఖ్య సమావేశం జరిగింది .ఈనెల నాలుగో తేదీన భీమవరంలో జరిగే రైతు సంఘం పశ్చిమగోదావరి జిల్లా సమావేశం భీమవరం ప్రకాశం చౌక్ లో జరుగుతుందని జిల్లాలో రైతులందరూ కౌలు రైతులు పాల్గొని ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మండలం నాగేశ్వరరావు, రూరల్ మండల కార్యదర్శి ఉల్లింకల జయకృష్ణ, దండ గర్ర గ్రామ రైతు నాయకుడు కర్రీ సోమేశ్వరరావు, దాస్యం రాము, అల్లం రాము పాల్గొన్నారు.

లింగ వివక్షత నిర్మూలన జరగాలి

విశాలాంధ్ర - లింగపాలెం : జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో లింగపాలెం వెలుగు కార్యాలయం వద్ద మహిళలు పలు కార్యక్రమాలు శనివారం నిర్వహిం చారు. సమాజంలో లింగ వివక్షత నిర్మూలన జరగాలని మహిళలు కోరారు. బాల్య వివాహాల వల్ల సమాజంలో అనర్థాలు జరుగు తున్నాయని, వీటిని పూర్తిగా నిర్మూ లించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని తెలిపారు. ఇటువంటి వాటిని నిర్మూలిం చటంలో ప్రజలు అవగాహనతో ఉండాలని కోరారు. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ఉంటామంటూ మహిళలు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు డి.మణి, కార్యదర్శి టి.అరుణకుమారి, మహిళా సంఘాల నాయకురాళ్ళు అన్నపూర్ణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలోకి కోర్టుల సముదాయం

విశాలాంధ్ర -భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని మూడవ అదనపు జిల్లా కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు మరియు ఆఫీస్ కార్యకలాపాలు ప్రభుత్వ ఆసుపత్రి దగ్గరలోని సివిల్ కోర్టు కాంప్లెక్స్ నుండి శ్రీరాంపురంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం మొదటి, రెండవ అంతస్తులకు మార్చినట్టు భీమవరం పట్టణ మూడవ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి పి.సత్య దేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబరు 4వ తేదీ సోమవారం నుండి బిఎస్ఎన్ఎల్ ప్రాంగణం నుండే కోర్టు సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని కక్షిదారులు మార్పును గమనించాలని ఆమె తెలిపారు.

పోరాట యోధుడు భూపతి సుబ్బరాజు

విశాలాంధ్ర - తణుకు: రైతాంగ సమస్యలపై, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిత్యం రాజీలేని పోరాటం చేసిన నాయకుడు భూపతి రాజు సుబ్బరాజు అని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు నాయకులు భూపతి రాజు సుబ్బరాజు 18వ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక వంక సత్యనారా యణ స్వరాజ్య భవనంలో సిపిఐ తణుకు పట్టణ సమితి ఆధ్వర్యంలో భూపతి రాజు సుబ్బరాజు కు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడారు. ముందుగా భూపతిరాజు సుబ్బరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం కోనాల భీమారావు మాట్లాడుతూ కమ్యూనిస్టు తొలితరం నాయకులుగా జిల్లాలో కమ్యూనిస్ట్ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఘనత సుబ్బరాజుకు దక్కుతుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఆశయ సాధన కొరకు అంకితభావంతో పనిచేసిన అమరజీవి భూపతిరాజు సుబ్బరాజు అని కొనియాడారు. అతి చిన్న వయసులో ఏఐఎస్ఎఫ్‌లో చేరి దేశ స్వాతంత్ర్యం కోసం జరిగే పోరాటంలో ఎంతో ధైర్య సాహసంతో పోరాడిన వ్యక్తి అని, అనేక సందర్భాల్లో అరెస్టయి సుదీర్ఘకాలం జైలు జీవితాన్ని గడిపిన స్వాతంత్ర సమరయోధుడు భూపతి రాజు సుబ్బరాజు అన్నారు. కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అప్పలస్వామి, గుబ్బల వెంకటేశ్వరరావు,గార ప్రసాద్, బండి సత్యనారాయణ, బొద్దాని మురళీకృష్ణ, నామన వెంకటేశ్వరరావు, బొద్దాని కృష్ణ కిషోర్, నూనె రాధాకృష్ణ తదితరులు పాల్గొని ఘన నివాళులర్పించారు.

సహచట్టంపై అవగాహన అవసరం

విశాలాంధ్ర-మండవల్లి: సమాచారహక్కు చట్టం-2005పై ప్రజలకు పూర్తి అవగాహన అవసరమని ఐక్యవేదిక నాయకులు ఎల్ఎస్ భాస్కరరావు, తెంటు అప్పారావులు అన్నారు. శనివారం కానుకొల్లు గ్రామంలో సర్పంచ్ ఎన్. ధామస్ అధ్యక్షతన సహ చట్టంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ సహచట్టం ప్రజలచేతిలో వజ్రాయుధం లాంటిదని చట్టాన్ని ఉపయోగించుకుని నిరక్షరాస్యులు సైతం తమకు కావాల్సిన సమాచారాన్ని అధికారుల వద్ద నుండి పొందవచ్చన్నారు. సహచట్టం అమలులోకి వచ్చి 18 సంవత్సరాలు గడుస్తున్నా ప్రజల్లో అవగాహన తక్కువగానే ఉందని ఐక్యవేదిక ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలు విరివిగా చేపడుతున్నామని సహచట్టంతో ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే అవినీతిని అడ్డుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

పంట రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

విశాలాంధ్ర-మండవల్లి: వాతావరణ శాఖ తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఖరీఫ్ వరి సాగుదారులు తగు జాగ్రత్తలు తీసుకుని పంటను రక్షించుకోవాలని వ్యవసాయాధికారిణి షేక్‌జరీనా అన్నారు.గింజ గట్టి పడి కోతకు సిద్ధంగా ఉన్న వరిలో సత్వరమే కోత మిషన్ వినియోగించి ధాన్యాన్ని సురక్షిత ప్రాంతానికి చేర్చుకోవాలని ధాన్యం తడవకుండా టార్పాలిన్‌పట్టాలు అందుబాటులో ఉంచుకోవాలని తుఫాన్ తగ్గిన తరువాత ధాన్యాన్ని ఆరబెట్టేందుకు ఏర్పాట్లు చేసుకోవా లన్నారు. వరి పంట కోసి పనలు పొలంలో ఉన్న పరిస్థితుల్లో సత్వరమే పనలను కట్టలు కట్టి కుప్పలు వేసుకుని తడవకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. తడిచిన వరి పనలపై మొలకలు రాకుండా 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని ఏవో జరీనా రైతాంగానికి సూచించారు.

జగనన్న గోరుముద్దకు వంటపాత్రల పంపిణీ

విశాలాంధ్ర- ఉంగుటూరు : విద్యార్థులకు మెరుగైన భోజనాలు అందజేయడం కోసమే వంట పాత్రలు ప్రభుత్వం ఇస్తుందని ఉంగుటూరు ఎంపీటీసీ సభ్యుడు డాక్టర్ పెనుగొండ బాలకృష్ణ అన్నారు. శనివారం స్థానిక నెంబర్ వన్ పాఠశాల వద్ద మధ్యాహ్నం భోజనం ఏజెన్సీలకు ఆయన వంట పాత్రలను పంపిణీ చేశారు. ఎంఈఓ కే శ్రీనివాస్ మాట్లాడుతూ మండ లంలో 68 పాఠశాలకు వంట సామగ్రి పంపిణీ చేశామన్నారు. కార్యక్ర మంలో ఎంపీటీసీ సందక రాంబాబు, వైసిపి నాయకులు రంగు వెంకటేశ్వర రావు, మంద జయలక్ష్మి, హెచ్ఎం ఎస్ పెద్దిరాజు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ముమ్మరంగా ఓటర్ల నమోదు

విశాలాంధ్ర - ముదినేపల్లి : పోలింగ్ కేంద్రాల్లో ముమ్మ రంగా ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, ప్రక్రియను ముదినేపల్లి మండలంలో అన్ని పోలింగ్ కేంద్రాలలో శనివారం నుండి ప్రారంభమైంది. 61 పోలింగ్ కేంద్రాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతుంది. తహసీల్దార్ కే.శ్రీనివాస్ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు. బిఎల్వోలు, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో నమోదు ప్రక్రియ జరుగుతుంది.

ఎలక్ట్రికల్ యూనియన్ వన సమారాధన

విశాలాంధ్ర-తణుకు: పట్టణంలోని ఎలక్ట్రికల్ యూనియన్ అసోసియేషన్ కార్తీక వన సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి తణుకు పట్టణ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు బొల్లాడ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు బొల్లాడ నాగరాజు ను సన్మానించి సత్కరించారు.

వైసీపీ ప్రభుత్వాన్ని దించి ఉమ్మడి ప్రభుత్వాన్ని స్థాపిద్దాం

విశాలాంధ్ర - నిడమర్రు: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని దించి ఉమ్మడి ప్రభుత్వాన్ని స్థాపించడానికి ప్రజలు అందరు కృషి చేయాలని ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు కోరారు.జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా శనివారం నిడమర్రు మండలం క్రొవ్విడి గ్రామంలో పర్యటించారు. స్థానిక జన సైనికులతో కలిసి ఇంటింటికి తిరిగి అక్కడ ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో పల్లె ప్రాంత ప్రజలు నిర్లక్ష్యానికి గురి అయ్యారని అన్నారు. డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడంలోను, రహదారిల నిర్మాణాలు చేపట్టడంలోనూ ప్రభుత్వం విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు వంద రోజుల సమయం మాత్రమే ఉందని, అరాచక పాలన కొనసాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపి జనసేన-తెలుగుదేశం పార్టీల ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అందరూ సహకరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రొవ్విడి గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు వాకముడి ఇంద్ర కుమార్, తోట శ్రీను, చింతలపాటి బాసి రాజు, అడపా త్రినాథ్ సాయి, అంజనీ సాయి, ముకేష్, మనీష్, నిమ్మల దుర్గా ప్రసాద్, నాగేంద్ర , లక్ష్మణ్, ఉత్తరిల్లి చందు, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుదారులకు తుపాను భయం

విశాలాంధ్ర-మండవల్లి: ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ఇంటికి తీసుకువచ్చే సమయంలో విపత్తులు రావటం పరిపాటిగా మారింది. ఈఏడాది ఖరీఫ్ సాగు ఆరంభంలో సకాలంలో వర్షాలు రాక నీటిసమస్యలను రైతాంగం ఎదుర్కొన్నారు. సెప్టెంబరు,అక్టోబరు నెలలో తీవ్ర వర్షాభావానికి తోడు పంట కాలువలకు వంతుల వారీగా నీటివిడుదలతో పంటను రక్షించుకవటానికి రైతాంగం నానా పాట్లు పడ్డారు. మండలంలో సుమారు 4వేల ఎకరాల్లో సార్వా వరి సాగు జరగగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు నాలుగు ఏర్పాటయ్యాయి. ఇప్పటికే సుమారు రెండు వేల ఎకరాలకు పైబడి వరి కోతలు ,మాసూళ్లు పూర్తవ్వగా రెండవ పంటగా అపరాలు వేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. దీపావళి తరువాత తుఫాన్ ఏర్పడినా ఆంధ్రరాష్ట్రంలో నామమాత్రపు ప్రభావం చూపటంతో వెద సాగు రైతులు కోతలు కోశారు. ఆలస్యంగా నాటిన వరిపైర్లు డిశెంబరు నెలలో కోతకు రానుండటంతో తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి సాగుదారులు తీవ్రంగా కలత చెందుతున్నారు. శనివారం, ఆదివారం నుండే భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో పాటు మచిలీపట్టణం సమీపంలోనే తీరాన్ని దాటుతుందనే వార్తలు రైతుల్ని మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.ప్రమాద హెచ్చరికలు జారీచేస్తుండటంతో పాటు రైతాంగం పంటను రక్షించుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తుండటంతో ఖరీఫ్ సాగుదారులు పంటను దక్కించుకునే క్రమంలో నిమగ్నమయ్యారు వాతావరణంలో మబ్బులు, కూలీల కొరతతో సమస్యలు మరింతగా పెరిగాయి.పంట కోసిన పొలాల్లో వరిగడ్డిని తరలించేందుకు రైతులు కుస్తీలు పడతుండగా కొందరైతే వరిగడ్డిని తగులబెడుతున్నారు. తుఫాన్ ప్రభావంతో వానలు కురిస్తే రైతులు భారీగానే నష్టపోవాల్సి వస్తుందనే వ్యాఖ్యానాలు వినవస్తున్నాయి.

దివ్యాంగ పిల్లలకు ట్యాబుల పంపిణీ

విశాలాంధ్ర- ఉంగుటూరు: సమ్మిళిత విద్యా కార్యక్రమాలతో విభిన్న ప్రతిభావంతులకు ఎంతో మేలు కలుగుతుందని ఉంగుటూరు ఎంపీడీవో ప్రేమాన్విత అన్నారు. ఉంగుటూరు ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. ఉంగుటూరు మండల సచివాలయ కన్వీనర్ డాక్టర్ పెనుగొండ బాలకృష్ణ ఎంపీటీసీ సందక రాంబాబు, ఎంఈఓ శ్రీనివాస్ వికలాంగులైన పిల్లలకు ప్రభుత్వం ద్వారా మంజూరైన ట్యాబులను పంపిణీ చేశారు. హెచ్ఎం పెద్దిరాజు, విలీన ఉపాధ్యాయులు రాజు, విమలలు పాల్గొన్నారు.

బీసీ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన

విశాలాంధ్ర- తణుకు: పాతవూరు శ్రీఉమా సిద్దేశ్వర స్వామి ఆలయం ముందు మేలు చేయరా సోదరా బిసి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు రండి అప్పారావు,సంఘ సభ్యులు, వావిలాల సరళా దేవి తదితరుల ఆధ్వర్యంలో కార్తీక మాసం సందర్భంగా భారీ వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 15000 మందికి పైగా పాల్గొని జయప్రదం చేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం మహిళా సేవకులు పాల్గొన్ని వారి సేవలను అందజేశారు. సంఘ పెద్దలు,వావిలాల సరళా దేవి దేవస్థానం మహిళా సేవకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాదాకృష్ణ , వీవర్స్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ వావిలాల సరళా దేవి, పి బి ఆర్ తదితరులు పాల్గొన్నారు.సంఘ గౌరవ అధ్యక్షులు ఎస్. నారాయణ రాజు, షేక్ మస్తాన్, సెక్రటరీ చిలికోటి శ్రీనివాస్ , రాష్ట్ర యూత్ ప్రెసిడెంట్ రండి ప్రసాద్, టౌన్ ప్రెసిడెంట్ నంది, బీసీ సోదరి సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జీలుగుమిల్లి తహసిల్దార్ జి. సుందర్ సింగ్ సూచించారు. శనివారం జీలుగుమిల్లి హైస్కూల్లో ప్రత్యేక పోలింగ్ కేంద్రం ఏర్పాటుచేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 32 పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. డిసెంబర్ 9వ తేదీ వరకు ఓటర్ నమోదు కార్యక్రమం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్వోలు లక్ష్మీ ప్రసన్న, కన్నయ్య కస్తూరి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖలో సిబ్బంది కొరత

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలో ఫారెస్ట్ సిబ్బంది కొరత గానే ఉందని సబ్ డి ఎఫ్ ఓ ఏ వెంకటసుబ్బయ్య అన్నారు. శనివారం జీలుగుమిల్లి ఫారెస్ట్ చెక్ పోస్ట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఫారెస్ట్ సిబ్బందిని నియమించే వరకు సిబ్బంది కొరతగానే ఉంటుందని అన్నారు. చెక్ పోస్ట్ రికార్డులను పరిశీలించారు. ఆయనతోపాటు జీలుగుమిల్లి గార్డు జి.మారేషు, చెక్‌పోస్టు సిబ్బంది రహమత్ ఉన్నారు.

జనరల్ నాలెడ్జి పోటీలో భాష్యం విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-పెనుగొండ: న్యూఢిల్లీ వారు ఏలూరులో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రాథమిక స్థాయి విద్యార్థులకు నిర్వహించిన జనరల్ నాలెడ్జి పోటీలలో పశ్చిమ గోదావరి జిల్లా విద్యార్థులు మొదటి స్థానం సాధించారాని ప్రధానోపాధ్యాయుడు వెంకట అప్పారావు తెలిపారు. పెనుగొండ భాష్యం నుండి నాయుడు రఘురాం(మూడవ తరగతి), కొవ్వూరు కళ్యాణ సాయి రెడ్డి(మూడో తరగతి), కర్రి దీక్ష (నాలుగో తరగతి) పోటీలో పాల్గొని ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచి ట్రోఫీతో పాటు ప్రశంశా పత్రం, ఎడ్యుకేషన్ ఆంధ్రజ్యోతి ప్రదీప్ జనరల్ మేనేజర్ మెహతా, భాష్యం జోనల్ ఇన్చార్జ్ ఏ.శ్రీమన్నారాయణ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో లిటిల్ ఛాంప్స్ ఇన్‌చార్జి రాణి రోజాజి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మానవతకు మార్చురీ ఫ్రీజర్ వితరణ

విశాలాంధ్ర-పెంటపాడు: పెంటపాడు మండలానికి చెందిన రిటైర్డ్ ఆంధ్రాబ్యాంక్ మేనేజర్ తాడేపల్లి మోహనరావు శనివారం మార్చురీ ఫ్రీజర్ బహుకరించారు. పీసీసీ మాజీ అధ్యక్షులు దివంగత తాడేపల్లి ముసలయ్య, కృపమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు పెంటపాడు రిటైర్డ్ ఆంధ్రా బ్యాంక్ మేనేజర్,పశ్చిమగోదావరి జిల్లా మానవత అధ్యక్షులు తాడేపల్లి మోహన రావు, కోడలు సూర్య చంద్ర కుమారి సౌజన్యంతో ఫ్రీజర్ బహుకరించారు. మానవత సంస్థ వ్యవస్థాపకులు ఎన్ . రామచంద్ర రెడ్డి చేతుల మీదుగా రూ.70 వేల విలువ గల మార్చురీ ఫ్రీజర్‌ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తండ్రికి తగ్గ తనయుడు మోహన్ రావు అని, మానవసేవే మాధవసేవఅని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఆత్మీయ కమిటీ జిల్లా చైర్మన్ సాగిరాజు జానకిరామరాజు, మానవతా ఎడిటోరియల్ చైర్మన్ రామిశెట్టి గంగాధరరావు, కడప జిల్లా మానవతా అధ్యక్షులు ఎస్.రామాంజనేయరెడ్డి, ఉండి మండల మానవతా అధ్యక్షులు యువరాజ్, ఉండి మండల కన్వీనర్ వి.వినాయక్, మానవతా సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిగా కలెక్టర్

విశాలాంధ్ర-ఏలూరు: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా చాటపర్రు గ్రామంలోని శ్రీ మాగంటి ఆంజనేయ సత్యవతి జిల్లాపరిషత్ హైస్కూల్‌ను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సందర్శించారు. ఈ సందర్భంగా 8,9 తరగతుల విద్యార్థినిలకు యూనిట్ పరీక్షలకు సంబంధించిన వారు వ్రాసిన జవాబు పత్రాలను పరిశీలించారు. ఈ పరిశీలనలో ఎమౌంట్ ఆఫ్ మనీ, స్పెంట్ ఫ్యామిలీ అనే ఇంగ్లీషు ప్రశ్నను ముగ్గురు విద్యార్థులను తెలుగులో వాటి సమాధానాన్ని అడిగారు. విద్యార్థులను ముఖా ముఖిగా పెట్టి ప్రభుత్వం విద్యార్థులకు ట్యాబ్ లు ఇవ్వడం ద్వారా దాని ఉపయోగం గురించి వారిని సంభాషించమని కలెక్టర్ అడిగారు. రాబోయే రోజుల్లో విద్యార్థులకు పూర్తిగా ట్యాబ్‌లోనే వారి పాఠ్యాంశాలను ఉంచడం ద్వారా పుస్తకాల బరువు తగ్గడం, సాంకేతికమైన విద్య ద్వారా మేధాశక్తిని పెంచడం కోసం రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసిందని వాటిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకొని విద్యలో రాణించాలని కోరారు. అనంతరం హైస్కూల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సందర్శించడం జరిగింది. కార్యక్రమంలో తహశీల్దారు శ్రీనివాస్, బూత్ లెవల్ అధికారులు, హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-భీమడోలు: ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలోని 214 పోలింగ్ కేంద్రాల వద్ద శని,ఆదివారాలలో బిఎల్ఓ ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్ సేవలను వినియోగించుకోవాలని ఏలూరు ఆర్డీవో ఎన్ ఎస్ కే ఖాజావలి కోరారు. శనివారం ఆయన భీమడోలు మండల పర్యటనలో భాగంగా భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలు 91 ,92 ,93, 94 వద్ద కొనసాగుతున్న కార్యక్రమ సేవలను పరిశీలించారు. బిఎల్వోలకు పలు సూచనలు చేసారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు విలువను తెలుసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని కోరారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై దరఖాస్తులు అభ్యంతరాలను ఈ నెల 9వ తేదీలోగా తెలియజేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదై జాబితాలో వారి వివరాలు ఉండేలా బాధ్యులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భీమడోలు డిప్యూటీ తహసిల్దార్ షంషుద్దీన్ ,గ్రామ రెవెన్యూ అధికారులు సాల్మన్ రాజు, వెజ్జు వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేయాలి

విశాలాంధ్ర - లింగపాలెం : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై రైతులు అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి కోటగిరి మురళీకృష్ణ తెలిపారు. పొలంబడి క్షేత్ర దినోత్సవం సందర్భంగా భోగోలులో రైతులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆధునిక పరిజ్ఞానంతో వ్యవసాయం చేయడం వల్ల పెట్టుబడి తక్కువ అవుతుందని దిగుబడులు అధికంగా వస్తాయని తెలిపారు. పండించిన పంట నాణ్యతగా ఉండటంతో పాటు కల్తీ లేని వ్యవసాయ ఉత్పత్తులను వినియోగదారులకు అందించవచ్చని తెలిపారు. రైతులు దీనిపై అవగాహనతో ఉండాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి సమాఖ్య చైర్మన్ ఇనుగంటి రంగారావు, పంచాయతీ కార్యదర్శి నాగదుర్గ వెంకటేశ్వరి, వ్యవసాయ సహాయకులు బొల్లవరపు సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటుతో ప్రజాస్వామ్య పరిరక్షణ

విశాలాంధ్ర -భీమవరం: నిజాయితీగా ఓటు వేసినప్పుడే ప్రజా స్వామ్యానికి రక్షణని, ఓటు నమోదు చేయించుకోవడం యువత కర్తవ్యమని ఆర్.ఆర్.డి.ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వికెజే ప్రసూన అన్నారు. భీమవరం రెవెన్యూ శాఖ, శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో కళాశాలలో ఓటు విలువ ప్రాముఖ్యత, ఓటు నమోదులపై ప్రచార భేరి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం చెరుకువాడ రంగసాయి విద్యార్థులచే ప్రతిజ్ఞ నిర్వహించి ప్రచార భేరి ర్యాలీ నిర్వహించారు.

కార్యదర్శులు బాధ్యతగా పనిచేయాలి

విశాలాంధ్ర - పాలకొల్లు: పంచాయతీ కార్యదర్శులు గ్రామ పరిపాలనను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, అంకితభావంతో పనిచేయాలని పాలకొల్లు మండల ఈవోపీఆర్ అండ్ ఆర్డీ వైభవతి అన్నారు. శనివారం పాలకొల్లు మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన కార్యదర్శుల సర్పంచ్‌ల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ చాలామంది కార్యదర్శులు పంచాయతీలకు సక్రమంగా హాజరు కావడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని ఇలా చేస్తే కఠిన చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు.

వెలమ సామాజిక వర్గానికి సముచిత స్థానం

విశాలాంధ్ర-ఏలూరు : వెలమ సామాజిక వర్గానికి అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించినట్లు ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖామంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. స్థానిక లూనాని నగర్లో శనివారం కొప్పుల వెలమ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, స్థానిక శాసనసభ్యులు ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని) తో కలిసి ముత్యాలనాయుడు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కొప్పుల వెలమ సామాజిక వర్గం అభివృద్ధికి కూడా కృషిచేస్తున్నారని తెలిపారు. ఏలూరు పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కుల, మత ,ప్రాంత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గంటా పద్మశ్రీ మాట్లాడుతూ వెలమ సామాజిక వర్గ వర్గ ప్రజలకు సముచిత స్థానం పెద్ద పేట వేశారు అనడానికి జడ్పీ చైర్మన్ అయిన తానే నిదర్శనం అన్నారు. మాజీ ఉపముఖ్య ముఖ్యమంత్రి ఆళ్ళ నాని మాట్లాడుతూ కొప్పుల వెలమ సామాజిక ప్రజలకు రాజకీయ లబ్ధి కోసం స్థలం అందించలేదని ఆ సామాజిక వర్గ ముఖ్య నేతలు తెలిపిన మీదట వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తానూ మండపానికి స్థలం కేటాయించినట్లు తెలిపారు.వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు గంటా ప్రసాద్ రావు, మాజీ మంత్రి మరడాని రంగారావు వెలమ సామాజిక వర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే నానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లు మేక ప్రతాప అప్పారావు , నాగేశ్వరరావు ఎమ్మెల్యే పుప్పాల వాసు బాబు, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొటారు రామచంద్రరావు, ఉంగుటూరు జడ్పీటీసి విజయలక్ష్మి శ్రీనివాస్, ఉంగుటూరు ఏఎంసి చైర్ పర్సన్ రమావతి ఆకివీడు మున్సిపల్ చైర్మన్ జామి హైమావతి శ్రీనివాస్ మండల కళ్యాణ మండప నిర్మాణ కమిటీ సభ్యులు పెద్దింటి నీలకంఠేశ్వరరావు కంద్రిక గూడెం సర్పంచ్ లచ్చిరెడ్డి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరుగా నమోదు చేసుకోండి

విశాలాంధ్ర - కరప : జనవరి ఒకటి నాటికి 18 సంవత్సరాల నిండిన వయోజనులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం కరప గ్రామంలోని 66వ పోలింగ్ కేంద్రం నందు ఓటరు పరిశీలన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని బూత్ లెవెల్ అధికారులకు సూచనలు సలహాలు అందించారు. కొత్త ఓటర్లుగా పురుషులు 62, స్త్రీలు 61 ఫారం సిక్స్ నింపి దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఫారం సెవెన్ నందు 29 మంది పురుషులు 19 మంది మహిళలు క్లైమ్ లు ఇచ్చినట్టు తెలిపారు. ఫారం 8లో 28 మంది పురుషులు, 26 మంది మహిళలు మార్పులు చేర్పులు చేసుకునేందుకు ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మాచర్రావు, వీఆర్వో రామకృష్ణారెడ్డి, బిఎల్వోలు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గొల్లపుంతలో కార్తీక వనసమారాధన ఏర్పాట్లు

విశాలాంధ్ర - మండపేట : వైఎస్సార్సీపీ కుటుంబ సభ్యుల కార్తీక వన సమారాధనకు ప్రజలంతా తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పిలుపునిచ్చారు. డిసెంబర్ 10న భారీ ఎత్తున నిర్వహించే వైసీపీ కుటుంబ సభ్యుల కార్తీక వన సమారాధనకు గొల్లపుంత రోడ్డులోని సంకా సుధాకర్ లే అవుట్ వేదిక కానుంది. ఈ నేపథ్యంలో శనివారం ఎమ్మెల్సీ తోట ఆ పార్టీ నాయకులు రెడ్డి రాజబాబు, మేకా శ్రీనివాస్, పతివాడ రమణ, కాళ్లకూరి నాగబాబు, కొమ్ము రాంబాబు, దేవు ప్రసాద్ నాయుడు, మెండు బాపిరాజు, మీగడ శ్రీనివాస్ ఇతర నాయకులతో కలిసి సమారాధన ప్రాంగణాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాట్ల కోసం నాయకులతో కలిసి చర్చించారు. ద్రాక్షారామ నుంచి నిష్ణాతులను పిలిపించి భోజన ఏర్పాట్ల బాధ్యత అప్పగించారు. నాయకుల సలహాలు తీసుకున్నారు.

కోనసీమ శెట్టిబలిజ వన సమారాధన విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కాట్రేనికోన : ఈనెల 10వ తేదీ ఆదివారం అమలాపురం, కొంకాపల్లి సత్యమ్మ తల్లి గుడి వద్ద నిర్వహించే కోనసీమ శెట్టిబలిజ కార్తీక మాస వన సమారాధనకు ప్రతి ఒక్కరు విచ్చేసి విజయవంతం చేయాలని శెట్టి బలిజ సంఘం నాయకులు, ఎస్ఏఎఫ్ అధినేత వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. శనివారం కాట్రేనికోన మండలంలోని పల్లంకురు, కందికుప్ప, కాట్రేనికోన, దొంతి కుర్రు, కొప్పిగుంట, కుండలేశ్వరం ,వేట్లపాలెం తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఆహ్వాన కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో కొప్పిశెట్టి ఆనందరావు, మట్టపర్తి వెంకటేశ్వరరావు, పితాని వెంకటరావు, విల్ల సత్తిబాబు, కముజు సర్వేశ్వరరావు, మట్టపర్తి గణేష్, వాసంశెట్టి రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా రామకృష్ణ

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నాలుగవసారి దుద్దుకూరు గ్రామానికి చెందిన వెలగా రామకృష్ణ ఎంపికయ్యారు. ఈ మేరకు తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అరిగెల అరుణ్ కుమారి ధ్రువపత్రం అందజేశారు. వెలగ రామకృష్ణ కాంగ్రెస్ పార్టీలో గత 40 సంవత్సరాలుగా వివిధ పదవులు అలంకరించారు. 1985 నుండి గోపాలపురంనియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పాల్గొని ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. ఈ సందర్భంగా వెలగా రామకృష్ణ మాట్లాడుతూ జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీలో ఉండటం తన అదృష్టమన్నారు. రాబోవు లోక్‌సభ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని తెలిపారు.

సమృద్ధ భారత్ కోసమే సంకల్పయాత్ర

విశాలాంధ్ర - అనపర్తి : సమృద్ధ భారత్ కోసమే కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రారంభించిందని బిజెపి మండల అధ్యక్షులు తాడి గంగిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పేరా రామచంద్రపురం, దుప్పలపూడి గ్రామాల్లో సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గొలుగూరి సత్యనారాయణ రెడ్డి, రాజేష్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానవాళి రక్షణకై అవతరించిన జీసస్

విశాలాంధ్ర - గోపాలపురం : మానవాళి రక్షణార్థమై ఏసుక్రీస్తు లోక రక్షకుడిగా అవతరించడమే క్రిస్మస్ వేడుక అని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ రిటైర్డ్ డిజిఎం ఎంజెకె మోహన్ తెలిపారు. మండలంలోని వాదాలకుంట శాలెం ప్రార్ధన మందిరంలో శాలెం గాస్పల్ మినిస్ట్రీస్ డైరెక్టర్ కె. మాణిక్యం, పాస్టర్ పి.జకర్య ఆధ్వర్యంలో గత కొన్నేళ్లగా నిర్వహిస్తున్న బైబిల్ క్లాస్ సేవకుల సెమీ క్రిస్మస్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎం జె కె మోహన్ మాట్లాడుతూ దానాలలో కెల్లా వస్త్ర దానం అత్యంత ఘనమైనదని అన్నారు. నీకు కలిగిన దానిలో నుండి నీ పొరుగు వానికి అందించడమే క్రీస్తు యేసు బోధనల సారాంశమని ఆయన అన్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుకునే మన భారత దేశంలో అన్ని కులాల మతాల జాతులు వారు క్రిస్మస్ పండుగను సమైక్యంగా జరుపుకుంటారన్నారు. అనంతరం 60 5 మంది పాస్టర్లకు సేవకురాంద్రకు దాత ఎం జె కె మోహన్ ప్రభావతి దంపతులు ఆర్థిక సహకారంతో ఏర్పాటుచేసిన నూతన వస్త్రాలను ఎంజెకె. మోహన్ ప్రభావతి, పాస్టర్ కె. తిమోతి, రిటైర్డ్ టీచర్ సిహెచ్ భాస్కరరావు, బ్రదర్ కే. మాణిక్యం, పాస్టర్ జెకర్యా, పాస్టర్ రవి చేతుల మీదుగా దైవ సేవకులకు సేవకురాంద్రకు అందించారు.

అచ్చియపాలెంలో దుప్పి హల్‌చల్

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని అచ్చియపాలెం గ్రామంలో శనివారం అడవి నుండి తప్పిపోయిన దుప్పి పిల్ల హల్‌చల్ చేసింది. అదే గ్రామానికి చెందిన ఎంకమ్మ కుక్కల్ని తరుము తుండగా దుప్పిని గమనించి కుక్కల బారి నుండి దుప్పిని రక్షించి దానికి వైద్య అందించి భద్రపరిచింది. స్థానిక అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

ఏపీ జెఏసి కో-చైర్మన్‌గా ప్రమీల రాణి

విశాలాంధ్ర-గోకవరం : ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం భాగస్వామిగా దాదాపు 100 ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల భాగస్వామ్యంగా ఉన్న ఏపీజేఏసీ అమరావతిలో.. ప్రత్యేకంగా మహిళా విభాగాన్ని ఏర్పాటు చేశారు. అందులో భాగంగా.. తూర్పుగోదావరి జిల్లా ఏపీ. జె.ఎసి విభాగం ఏర్పాటు చేశారు. ఈ విభాగంలో జిల్లా కో -చైర్మన్ గా గోకవరం మండలం రంప యర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రధాన ఉపాధ్యాయురాలు జి. ప్రమీల రాణి ని ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఏపీ జెఎసి ట్రైనింగ్ కాలేజ్ రాజమండ్రి రెవెన్యూ భవన్ లో ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు సంఘ సభ్యులు పాల్గొని ప్రమీల రాణి కి శుభాకాంక్షలు తెలియజేశారు.

కే సావరంలో ఉచిత దంత వైద్య శిబిరం

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు తో గ్రామ ప్రజల దంత సమస్యలు తీర్చిన భీమవరం విష్ణు డెంటల్ కాలేజీ యాజమాన్యానికి అభినందనలు తెలియజేస్తున్నట్లు సర్పంచ్ నార్ని రామకృష్ణ తెలిపారు. శనివారం కె సావరం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దంతాలకు సంబంధించిన సుమారు 70 మందికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్యం శిబిరంలోనే నిర్వహించినట్లు దంత వైద్యులు చైతన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు డాక్టర్లు, వీఆర్వో సోమిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ కాపా నాగరాజు, ఎం ఎల్ హెచ్ పి సంధ్యారాణి, ఏ ఎన్ ఎం రత్నకుమారి, ఆశాలు పాల్గొన్నారు.

ఆడుదాం-ఆంధ్ర కిట్ల పంపిణీ

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: రాష్ట్రప్రజల్లో క్రీడా స్ఫూర్తి నింపడానికి, గ్రామీణ ప్రాంతాల్లో వున్న క్రీడాకారులను వెలికి తీయడానికి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం దోహద పడుతుందని ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి అన్నారు. శనివారం ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె ఆధ్వర్యంలో నిర్వహించిన ఆడుదాం-ఆంధ్ర స్టేట్ లెవెల్ టోర్నమెంట్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆటల పోటీలకు సంబంధించిన సామగ్రిని సచివాలయాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జి.వి.యస్.రామకృష్ణంరాజు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల కార్యక్రమాన్ని నాయకులు, అధికారులు, సిబ్బంది అందరి సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు సిహెచ్ సక్సేనా రాజు, శారదా జోత్స్న, మండల పిఈటి లు, పీడీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ స్థాయి కస్టోడియన్ అధికారులు హాజరయ్యారు.

ప్రజా వ్యతిరేక పాలన అవలంబిస్తున్న జగన్

విశాలాంధ్ర - జగ్గంపేట : ప్రజా వ్యతిరేక పాలన అవలంబిస్తున్న జగన్మోహన్ రెడ్డి పాలనకు అంతం పలికేందుకు ప్రజలందరూ ఎదురు చూస్తున్నారని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. గత 90 రోజులుగా బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ, మహాశక్తి రథయాత్రను జగ్గంపేట నియోజకవర్గంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ముగింపు శనివారం జగ్గంపేటలో జరిగింది. ముఖ్య అతిథిగా నెహ్రూ హాజరై మాట్లాడుతూ మహిళలు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు తిరుగుతూ బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ, మహిళా శక్తి పథకాల కరపత్రాలను పంపిణీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, పాండ్రంగి రాంబాబు, దాపర్తి సీతారామయ్య, పీలా మహేష్, గుండా శివప్రసాద్, దేగల సత్తిబాబు, నేదురి గణేష్, రాయి సాయి, కింగం రామకృష్ణ, కొండ్రోతు శ్రీను, సాంబత్తుల చంద్రశేఖర్, మారిశెట్టి రాధా, మహిళా కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న చెరుకూరి

విశాలాంధ్ర - జగ్గంపేట : రక్తం అవసరమైన వారికి వెంటనే బ్లడ్ డోనేట్ చేసి మానవత్వం చాటుకున్నారు జగ్గంపేటకు చెందిన చెరుకూరి జయరాజ్. జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన అడబాల పార్వతి రాజమహేంద్రవరం హాస్పటల్‌లో చికిత్స పొందుతుంది. ఆమెకు అర్జెంట్‌గా బ్లడ్ అవసరం రావటంతో జగ్గంపేటకు చెందిన జయరాజ్‌ను బ్లడ్ ఇవ్వమనీ అడగటం జరిగింది. ఆయన వెంటనే స్పందించి రాజమండ్రి వెళ్లి రక్తదానం చేశారు. ఆయన సేవను కాకినాడ జిల్లా జెసిఎస్ కో ఆర్డినేటర్ ఒమ్మి రఘురామ్ అభినందించారు.

ఘనంగా ముగిసిన ఉజ్జీవ మహా సభలు

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మండల పాస్టర్స్ అసోసియేషన్ నిర్వహించిన 32వ వార్షిక మహాసభలు, క్రిస్టమస్ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. సభలు ముగింపులో భాగంగా నాల్గవ రోజు నిర్వహించిన గ్రాండ్ క్రిస్టమస్ వేడుక ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. అసోసియేషన్ అధ్యక్షులు రెవ డాక్టర్ పి. ఆనంద్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, పెద్దాపురం నియోజక వర్గ వైఎస్ఆర్సీపీ ఇన్‌చార్జి దవులూరి దొరబాబు, రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు తదితరులు విచ్చేసి పాల్గొన్నారు. హౌసింగ్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ సామర్లకోటలో క్రైస్తవ సమాదుల తోటకు స్తలకొరత ఉన్నందున దానికి సహకరించాలని హౌసింగ్ చైర్మన్ దొరబాబుకు అసోసియేషన్ నాయకులు విన్నవించగా దానికి చర్యలు చేపడుతున్నట్టు దొరబాబు చెప్పారు.

ఆకట్టుకున్న క్రిస్టమస్ ఆరాధన : ఐక్య క్రిస్టమస్ కార్యక్రమంలో క్రైస్తవ ప్రజల కొవ్వొత్తుల ఆరాధన ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. వేలాదిగా తరలి వచ్చిన ప్రజలు కొవ్వొత్తులను వెలిగించి బాలుడైన యేసుక్రీస్తు జననాన్ని గుర్తు చేసుకుంటూ ఆరాధన జరపగా కొవ్వొత్తుల కాంతులతో జూనియర్ కళాశాల గ్రౌండ్ వెలిగిపోయింది.

నూతన అధ్యక్షులుగా డాక్టర్ సాల్మన్ రాజు : సామర్లకోట మండల పాస్టర్స్ అసోసియేషన్ 2024 సంవత్సరానికి గానూ నూతన అధ్యక్షులుగా రెవ, డా ఎం సాల్మన్ రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - కాజులూరు : పేదల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రం ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలన చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంభందాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. శనివారం కాజులూరులో మండల గ్రామాలకు చెందిన 276 మంది లబ్ధిదారులకు అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కుల పట్టాలను మంత్రి వేణుగోపాలకృష్ణ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదలు, అసైన్డ్, సర్వీస్ ఇనామ్, లంక భూముల రైతులకు బారీమేలు చేసేలా ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వం కీలకనిర్ణయం తీసుకుందన్నారు. ప్రజలకు అన్ని విధాలుగా మేలు చేస్తున్న జగనన్నను ప్రజలు మరోసారి సీఎంను చెయ్యాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, వైఎస్సార్సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు, మండల తహసీల్దారు. సాయిసత్యనారా యణ, ఆర్ఎస్ఐ వేగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ దండంగి సరోజిని, పోతురాజు బాబురావు, దంగేటి అరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి మద్దతు తెలపండి

విశాలాంధ్ర - కలిదిండి: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు తోనే సాధ్యమని ప్రజలు సహ కరించి టిడిపికి మద్దతు తెలపాలని రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు ప్రజలను కోరారు. శనివారం మండలంలోని పెదలంక గ్రామపంచాయతీలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి బాబు ష్యూరిటి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టోలో ప్రకటించిన 6 పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షుడు దుగ్గిరాల పరమేశ్వరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.